TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 66 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ గురువారం | జూన్ 18, 2026

## నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం 'నీట్' పరీక్ష రాయబోతున్న విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ నెల 21న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరికీ టీజీఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పరీక్షకు వెళ్లే అభ్యర్థులు బస్సుల్లో తమ 'హాల్ టికెట్' చూపిస్తే ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతించాలని ఆర్టీసీ అధికారులకు, కండక్టర్లకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు?

- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత నిలదీత
- కేసు పెట్టడం చేతగాని ప్రభుత్వం తెలంగాణలో ఉంది
- కేటీఆర్ సిరిసిల్లకు కేవలం 'విజిటింగ్ టూరిస్ట్'
- నేరెళ్ల బాధితులపై బండి సంజయ్ ఎందుకు నోరుమెదపడం లేదు?




# భూకబ్జాదారుల భరతం పడతాం..




- పేదల జోలికి వెళ్లం: సీఎం రేవంత్ రెడ్డి
- గుర్రంగూడ ఎకో పార్క్‌లో ఘనంగా 'వనమహోత్సవం'
- నాగలింగం మొక్క నాటిన ముఖ్యమంత్రి
- హైడ్రాను భూతంలా చూపిస్తున్నారు..
- కబ్జాల నిరోధానికే ఈ వ్యవస్థ
- ఎవరు అడ్డుపడ్డా 'మూసీ' ప్రక్షాళన 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం జరిగి తీరుతాయి
- మూసీ మురికి కన్నా 'కల్వకుంట్ల' కడుపులోని విషమే ప్రమాదం
- సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

**రంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణలో ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాదారుల గురక పెట్టించేందుకే తాము 'హైడ్రా'ను తీసుకువచ్చామని, అయితే కొందరు రాజకీయ స్వార్థం కోసం హైడ్రాను ఒక భూతంలా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గురువారం రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ ఎకో పార్క్‌లో నిర్వహించిన 'వనమహోత్సవం' కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హరితనిధి కింద ఆయన నాగలింగం మొక్కను నాటి, రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు సీఎంకు వివరించారు. ఇక్కడ రూ.35.50 కోట్లతో ఎకో పార్క్, రూ.17.84 కోట్లతో రిజర్వ్ ఫారెస్ట్ అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు.

### హైడ్రా పేదల జోలికి వెళ్లదు..

అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "గుర్రంగూడ ఎకో పార్క్‌తో పాటు వనస్థలిపురంలోని దేవుడి భూములను కూడా గతంలో కబ్జా చేయాలని చూశారు. కబ్జాల వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు రాకూడదనే హైడ్రాను ఏర్పాటు చేశాం. ఇది పేదల జోలికి అస్సలు వెళ్లదు.. కేవలం పెద్ద పెద్ద కబ్జాదారుల భరతం పడుతుంది" అని తేల్చి చెప్పారు. తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ.. 2018లో కొందరి కుట్రల వల్ల కొడంగల్‌లో ఓడిపోయినప్పుడు రేవంత్ పని అయిపోయిందని భావించారని, కానీ మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించి ప్రశ్నించే గొంతుకగా నిలబెట్టారన్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలు తనకు 30 వేల పైచిలుకు మెజారిటీ ఇచ్చారని, తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని, సీఎంగా తానే ఇక్కడి సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# 'యూరియా యాప్'ను తక్షణమే తొలగించాలి

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్
- వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో
- రైతులు, గులాబీ శ్రేణులతో కలిసి జాతీయ రహదారిపై బైఠాయించిన మాజీ మంత్రి
- కాంగ్రెస్ సర్కార్‌పై, సీఎం రేవంత్ రెడ్డిపై ప్రశాంత్ రెడ్డి నిప్పులు




**నిజామాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న 'యూరియా యాప్'ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు గురువారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద భారీ ఆందోళన చేపట్టాయి. ఈ నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని రైతులు, గులాబీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాజీ మంత్రి ఆధ్వర్యంలో నాయకులంతా జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా వారు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల ఉసురు పోసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త తరహా యూరియా యాప్ పంపిణీ వ్యవస్థను తెరపైకి తెచ్చిందని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో ఉన్న దుకాణాల్లో అసలు యూరియా బస్తాలే లేనప్పుడు, కేవలం యాప్ ద్వారా రైతులకు ఎరువులు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. ( మిగతా వివరాలు 2వ పేజీలో..)

## 30న 'రైతు భరోసా' నిధుల విడుదల

- మధిర సభ వేదికగా సీఎం చేతుల మీదుగా పంపిణీ
- వరుసగా 9 రోజుల పాటు రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం
- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
గురువారం, జూన్ 18, 2026

# నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

## రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



( **మొదటి పేజీ తర్వాత..**) విద్యార్థులు ఎలాంటి ప్రయాణ ఇబ్బందులు పడకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఈ ఏడాది నీట్ పరీక్షను మరింత పారదర్శకంగా, సురక్షితంగా మరియు విద్యార్థులకు అనుకూలంగా నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పలు కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ ఈసారి పరీక్ష సమయాన్ని 195 నిమిషాలకు పెంచారు. ఎగ్జామ్ మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు జరగనుంది. పరీక్ష ప్రారంభానికి ముందు కేంద్రాల్లో అటెండెన్స్ డాక్యుమెంట్లపై సంతకాలు చేయడం, ఇన్విజిలేషన్ లాంఛనాలు పూర్తి చేయడం వంటి పరిపాలనాపరమైన పనుల వల్ల విద్యార్థులు తమకు కేటాయించిన రాత సమయాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎన్‌టీఏ ఈ అదనపు సమయాన్ని కేటాయించింది. దీనివల్ల విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్ష రాయవచ్చని, అభ్యర్థులందరూ ఈ కొత్త మార్పులను గమనించాలని ఎన్‌టీఏ స్పష్టం చేసింది.

# భూకబ్జాదారుల భరతం పడతాం..

- పేదల జోలికి వెళ్లం: సీఎం రేవంత్ రెడ్డి
- గుర్రంగూడ ఎకో పార్క్‌లో ఘనంగా 'వనమహోత్సవం'
- నాగలింగం మొక్క నాటిన ముఖ్యమంత్రి
- హైడ్రాను భూతంలా చూపిస్తున్నారు..
- కబ్జాల నిరోధానికే ఈ వ్యవస్థ
- ఎవరు అడ్డుపడ్డా 'మూసీ' ప్రక్షాళన,
- 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం జరిగి తీరుతాయి
- మూసీ మురికి కన్నా 'కల్వకుంట్ల' కడుపులోని విషమే ప్రమాదం
- సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



( **మొదటి పేజీ తర్వాత..**) కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తున్నామని తెలిపారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని నేడు ఢిల్లీ ప్రజలు పడుతున్న ఇబ్బందులు మన హైదరాబాద్‌కు రాకూడదనే ఉద్దేశంతోనే నగరంలో పెద్ద ఎత్తున గ్రీనరీ, మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. నగర భవిష్యత్తు అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తుంటే, రాజకీయ భవిష్యత్తు లేని నేతలు దాన్ని రద్దు చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. "ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తానంటున్న ఆ నాయకుడు ముందు సిద్దిపేటలో గెలిచి రావాలి, ఆ తర్వాత రద్దు గురించి మాట్లాడాలి" అని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామన్నా కొందరు ఎన్జీటీ (NGT)లో కేసులు వేసి అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మూసీ ప్రక్షాళన ఆగేదే లేదు..

ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మూసీ నది ప్రక్షాళన పనులు ఆపే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ రెడ్డి ఖరాఖండిగా చెప్పారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర మూసీ పునరుజ్జీవ పనులు చేపట్టి, సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే అద్భుతంగా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. "మూసీ నది ఒడ్డున నివసిస్తున్న పేద ప్రజలకు మెరుగైన పునరావాసం కల్పించి అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారు. మూసీ నదిలో ఉన్న కాలుష్యం కంటే.. కల్వకుంట్ల కుటుంబం కడుపులో ఉన్న విషమే ఎక్కువ. గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి అనుభవించిన సుధీర్ రెడ్డి, నేడు మూసీ పునరుజ్జీవాన్ని ఎలా అడ్డుకుంటారు?" అని సీఎం ప్రశ్నించారు. ప్రజలకు కాలుష్య రహిత వాతావరణం అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అడ్డుపడే వారి ఫ్యూచర్‌ను ప్రజలే నిర్ణయించి వారిని ఫామ్‌హౌస్‌లకే పరిమితం చేస్తారని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 30న 'రైతు భరోసా' నిధుల విడుదల

**మధిర సభ వేదికగా సీఎం చేతుల మీదుగా పంపిణీ**

**వరుసగా 9 రోజుల పాటు రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం**

**ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం**

**వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణలోని అన్నదాతలకు వానాకాలం సాగు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 30న 'రైతు భరోసా' నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించబోయే భారీ 'రైతు సమ్మేళనం' బహిరంగ సభ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను అధికారికంగా విడుదల చేస్తారని నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ నిధులు విడతల వారీగా వరుసగా తొమ్మిది రోజుల పాటు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. కాగా, రైతు భరోసా కింద ఏడాదికి ఎకరాకు రూ.12,000 ఆర్థిక సహాయం అందిస్తుండగా, ప్రస్తుత వానాకాలం సీజన్‌కు గాను ఎకరాకు రూ.6,000 చొప్పున ప్రభుత్వం విడుదల చేయనుంది. కేంద్ర ప్రభుత్వం కూడా 23వ విడత 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' నిధులను ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనుండటంతో, దేశవ్యాప్తంగా అర్హులైన రైతుల ఖాతాల్లో రూ.2,000 చొప్పున జమ కానున్నాయి. దీంతో కేవలం 10 రోజుల వ్యవధిలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లోకి రానుంది. కేబినెట్ భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను బట్టి రాష్ట్రంలోని ఏడు రకాల సన్న వరి ధాన్యానికి బోనస్ అందించాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. అయితే, తెలంగాణ నుండి కేంద్ర ప్రభుత్వం తక్కువ మొత్తంలో ధాన్యం సేకరించడంపై కేబినెట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందని, రాష్ట్రంలో పండిన మొత్తం ధాన్యాన్ని కేంద్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యానికి సమానంగానే రాష్ట్రం కూడా కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల కోటాను తక్షణమే విడుదల చేయాలని కేబినెట్ డిమాండ్ చేసింది. దీనిపై ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి పలుమార్లు లేఖలు రాశారని, త్వరలోనే రాష్ట్ర మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేయాలని తీర్మానించారు. రామగుండం ఫెర్టిలైజర్స్ లో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేయనున్నారు. ఆధునిక సాంకేతికతను జోడిస్తూ ఇకపై రాష్ట్రంలో 'డిజిటల్ కేబినెట్' పద్ధతిలోనే మంత్రివర్గ సమావేశాలు నిర్వహించబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు?

## టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత నిలదీత

**కరీంనగర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రాంతీయవాదాన్ని వేర్పాటువాదంతో పోల్చుతూ వ్యాఖ్యలు చేసిన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేసు పెట్టలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. తెలంగాణలో కేసు పెట్టడం కూడా చేతగాని దద్దమ్మ ప్రభుత్వం నడుస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. గురువారం కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి పలువురు నేతలు తెలంగాణ భావజాలంపై యథేచ్ఛగా దాడి చేస్తున్నారని కవిత ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని, ఈ విషయాన్ని కనీసం ప్రాధాన్యత లేని అంశంగా భావిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచిన కరీంనగర్ నడిబొడ్డున నేటికీ 'తెలంగాణ తల్లి' విగ్రహం లేకపోవడం ఇక్కడి ప్రజల త్యాగాలను అవమానపరచడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించిన కవిత, అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేటీఆర్ సిరిసిల్లా నియోజకవర్గానికి కేవలం ఒక 'విజిటింగ్ టూరిస్ట్' లాంటివారని, వీకెండ్‌లో మాత్రమే వచ్చి చుట్టపుచూపుగా వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. రా గతంలో నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదనను ప్రశ్నించినందుకు గాను దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, ఆ బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని కవిత గుర్తుచేశారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున ప్రస్తుత కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ఆమె ప్రశ్నించారు. "నాడు కార్పొరేటర్‌గా ప్రస్థానం ప్రారంభించి.. నేడు నేరెళ్ల బాధితుల, కరీంనగర్ ప్రజల ఓట్లతోనే బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారు. మరి ఇప్పుడు వారి సమస్యలపై ఎందుకు మౌనం వహిస్తున్నారు?" అని కవిత నిలదీశారు. ఈ సమావేశాల్లో తెలంగాణ రక్షణ సేన జిల్లా, నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'యూరియా యాప్'ను తక్షణమే తొలగించాలి

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్
- వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో
- రైతులు, గులాబీ శ్రేణులతో కలిసి జాతీయ రహదారిపై బైఠాయించిన మాజీ మంత్రి
- కాంగ్రెస్ సర్కార్‌పై, సీఎం రేవంత్ రెడ్డిపై ప్రశాంత్ రెడ్డి నిప్పులు

( **మొదటి పేజీ తర్వాత..**) ఈ స్మార్ట్‌ఫోన్ యాప్ నిబంధన వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య రైతులు సకాలంలో ఎరువులు అందక అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'యూరియా యాప్ పోవాలి.. రేవంత్ సర్కార్ దిగిరావాలి' అంటూ ఈ సందర్భంగా నిరసనకారులు నినదించారు. రైతులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ప్రభుత్వం ఇటువంటి వింత పోకడలను అవలంబిస్తూ అన్నదాతలను తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనా సకాలంలో పెట్టుబడి సాయం 'రైతుబంధు' ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు రైతులను రాజులను చేశారని ఆయన గుర్తుచేశారు. నాడు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు, ఉచిత విద్యుత్ మరియు పెట్టుబడి సాయం అందించి రైతు సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు. ప్రస్తుత రేవంత్ సర్కార్ రైతులు పడుతున్న ఇబ్బందులను చూస్తూ కూడా మొద్దు నిద్ర నటిస్తోందని, ఇది నిజంగా సిగ్గుచేటని ప్రశాంత్ రెడ్డి దుయ్యబట్టారు. ఈ రాస్తారోకో, ఆందోళన కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, విండో చైర్మన్లు, రైతు బంధు సమితి ప్రతినిధులు మరియు వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
గురువారం, జూన్ 18, 2026

# జిల్లా స్థాయి పోటీల్లో 'బేబీ దృతిరాజ్'కు ప్రథమ బహుమతి

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5న జిల్లా అటవీశాఖ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీల్లో హన్మకొండ ముచ్చర్ల రోడ్డులోని భవ్య ట్యుటోరియల్స్‌కు చెందిన బేబీ దృతిరాజ్ అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. గురువారం హనుమకొండలో నిర్వహించిన ప్రత్యేక పురస్కారాల ప్రదానోత్సవంలో బేబీ దృతిరాజ్ ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఈ జిల్లా స్థాయి ప్రథమ బహుమతిని, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మయూరి చేతుల మీదుగా చిన్నారి దృతిరాజ్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. చిరుప్రాయంలోనే పర్యావరణ పరిరక్షణపై చక్కటి ప్రతిభను చాటిన చిన్నారిని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వహణ కమిటీ అధ్యక్షులు శ్యామ్ సుందర్, ప్రతినిధి నాగేశ్వర్ గారు పాల్గొని చిన్నారికి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. బేబీ దృతిరాజ్ జిల్లా స్థాయిలో ప్రథమ



బహుమతి సాధించడం పట్ల భవ్య ట్యుటోరియల్స్ డైరెక్టర్ తిరునగరి విజయ్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గురువారం ట్యుటోరియల్ ఆవరణలో చిన్నారిని ప్రత్యేకంగా అభినందించిన ఆయన, విద్యార్థినిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ తిరునగరి విజయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే పర్యావరణం వంటి అంశాలపై నిర్వహించే ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వేదికలు చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ ఈ తరహా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# మానవ సేవే మాధవ సేవ

- 725వ రోజుకు చేరిన 'అన్నపూర్ణ' అన్నదానం

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** 'అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్నదాత సుఖీభవ' అనే నినాదంతో ముందుకు సాగుతూ, మానవ సేవే మాధవ సేవగా భావించి 'అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ' చేస్తున్న సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈ సంస్థ ఆధ్వర్యంలో నిత్యం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం గురువారంతో విజయవంతంగా 725వ రోజుకు చేరుకుంది. సాయి అనీష్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని, వారి అమ్మమ్మ మరియు తాతయ్య అందించిన ఆర్థిక సహాయంతో ఈరోజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాశ్వత దాతలు నాగుబోతు రవీందర్ – జ్యోతి దంపతులు (భాను ఏజెన్సీస్), అలాగే సంవత్సర దాతలు తోట లక్ష్మీ, కూరగాయల మధు – మమత దంపతులు తమ వంతు అండగా నిలిచారు. వీరి సమగ్ర సహకారంతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణతో పాటు పట్టణంలోని పలు పరిసర ప్రాంతాలలో ఉన్న అన్నార్తులకు, యాచకులకు సంస్థ ప్రతినిధులు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ



స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తోట లహరి మాట్లాడుతూ.. గత 725 రోజులుగా ఎంతోమంది దాతల సహకారంతో ఈ ఆకలి తీర్చే కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ ట్రస్ట్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇందుకు సమాజంలోని దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సహాయం చేయాలనుకునే దాతలు 8919376459 నెంబర్‌ను సంప్రదించవచ్చని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మానవతా కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోట లహరి, రాజేష్, పలువురు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# 22న సర్, బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు

- హాజరుకానున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు
- అచ్చంపేట పట్టణంలోని బీకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాట్లు
- వివరాలు వెల్లడించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** త్వరలో ప్రారంభం కానున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు ఈ నెల 22న అచ్చంపేట పట్టణంలోని బీకే ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే, అచ్చంపేట బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త మర్రి జనార్దన్ రెడ్డి తెలిపారు. గురువారం అచ్చంపేట పట్టణంలోని పటేల్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోకల మనోహర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి టౌన్, మండలాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాట్లు, పార్టీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 22న జరిగే ప్రతిష్టాత్మక అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విచ్చేస్తున్నట్లు ప్రకటించారు. జూన్ 25 నుండి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తరపున నియమితులయ్యే బూత్ లెవల్ ఏజెంట్ల బాధ్యతలు, విధులపై ఈ సదస్సులో స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణలు, మార్పులు, చేర్పులు మరియు అనర్హులైన ఓటర్ల తొలగింపు తదితర కీలక అంశాలపై పార్టీ కార్యకర్తలకు, నాయకులకు త్వరలోనే ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీ శ్రేణులన్నీ బూత్ స్థాయిలో అత్యంత అప్రమత్తంగా



వ్యవహరించాలని ఆయన సూచించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో డిజిటల్ పద్ధతిలో ప్రారంభం కానున్న బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కూడా ఈ సదస్సులో కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం జరుగుతుందని నేతలు స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సంప్రదింపుల సమావేశంలో అచ్చంపేట టౌన్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్త నిరసనలు మున్సిపల్ కార్యాలయాల వద్ద హోరెత్తాయి. ఇందులో భాగంగా వేములవాడ పట్టణ మున్సిపల్ కార్యాలయం ముందు గురువారం మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో రెండు రోజుల నిరసన దీక్షలు మిన్నంటాయి. ఈ నిరసన దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మోసం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి బుర్ర అశోక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. పట్టణాల పరిశుభ్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ నిరసన కార్యక్రమంలో కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నేతలు నినదించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన దీక్షా కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు సరిపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి దుబ్బల లచ్చయ్య, ఉపాధ్యక్షులు సుంకపాక పరిశ్రమలు, సావనపల్లి శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్, ఎండి అజ్జు, బొడ్డు శ్రీనివాస్, గాజుల వజ్రమ్మ, బావిలాల లక్ష్మి, పుప్పాల మమత, వావిలాల రాధాతో పాటు వందలాది మంది మున్సిపల్ కార్మికులు పాల్గొని మద్దతు తెలిపారు.

# భీమేశ్వర స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు

## 28 రోజుల ఆదాయం రూ.1.70 కోట్లు



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన 'శ్రీ భీమేశ్వర స్వామి' ఆలయంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత 28 రోజుల కాలానికి గాను భక్తులు స్వామివారికి సమర్పించుకున్న కానుకల వివరాలను ఆలయ అధికారులు అధికారికంగా వెల్లడించారు. ఈ లెక్కింపులో స్వామివారికి నగదు రూపంలో రూ.1,70,65,200 భారీ ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. నగదుతో పాటు భక్తులు తమ మొక్కుల రూపంలో స్వామివారికి సమర్పించిన విలువైన మిశ్రమ బంగారం: 080 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, మిశ్రమ వెండి 07 కిలోల 400 గ్రాములు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ హుండీ లెక్కింపు ప్రక్రియను దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి, కరీంనగర్ ఏసీ ఆఫీస్ పరిశీలకులు రాజమౌళి, డీఈవో భాస్కర శర్మల సంయుక్త పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపు సేవలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, తగిన రక్షణ చర్యల మధ్య పోలీస్ సిబ్బందితో పాటు 'శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి' సభ్యులు, భక్తులు పాల్గొని కానుకలను లెక్కించారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
గురువారం, జూన్ 18, 2026

## బాధిత కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించిన నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం నుండి న్యాయం చేకూరింది. ఆరు నెలల క్రితం ఉప్పునుంతల మండలం కాంసాన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకున్న విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన మధునాకుల శేఖర్ కుటుంబానికి విద్యుత్ శాఖ మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అచ్చంపేట శాసనసభ్యులు, 'నల్లమల ముద్దుబిడ్డ' డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. గురువారం ఉప్పునుంతలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మృతుడి భార్య లావణ్యకు ఈ ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందజేసి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు కుటుంబ యజమానిని కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, విద్యుత్ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ చెక్కు పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ దేవా, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, విద్యుత్ శాఖ ఏడీ గోపాల్, అచ్చంపేట ఏఈ ఆంజనేయులు, ఉప్పునుంతల మండలం ఏఈ కొండల్ మహేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, కాంసాన్‌పల్లి గ్రామ సర్పంచ్ చింతగాల్ల శ్రీనివాసులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఘనంగా 'వన మహోత్సవం'

- హాజరై మొక్కలు నాటిన ఎమ్మెల్యే వంశీకృష్ణ
- వన మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ..



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'వన మహోత్సవం–2026' కార్యక్రమం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో దుర్వాసుల చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన ఈ పచ్చదన పరిరక్షణ మహోత్సవానికి అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచాన్ని కుదిపేస్తున్న వాతావరణ మార్పులు, ప్రకృతి విపత్తులను ఎదుర్కోవాలంటే అడవుల సంరక్షణ ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు.



ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని వృక్షాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. పచ్చని తెలంగాణ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యమే అత్యంత కీలకమని పేర్కొన్నారు. అనంతరం 'వన మహోత్సవం–2026' అధికారిక పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర మాట్లాడుతూ.. టైగర్ రిజర్వ్ పరిధిలో అడవుల విస్తరణతో పాటు జీవ వైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ కట్టుబడి ఉందన్నారు. ఈ క్రతువులో స్థానిక ప్రజల సహకారం ఎంతో అవసరమని కోరారు. ఇదే సందర్భంలో జీవవైవిధ్య పరిరక్షణకు అద్దం పట్టే మరో సంఘటన చోటుచేసుకుంది. మన్ననూరు గ్రామంలో జనావాసాల్లోకి వచ్చిన ఒక పామును గ్రామస్తుల సమాచారంతో స్నేక్ క్యాచర్ విష్ణు సురక్షితంగా పట్టుకున్నారు. ఆ పామును ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, అటవీ అధికారుల సమక్షంలో దాని సహజ ఆవాసమైన అమ్రాబాద్ దట్టమైన అడవుల్లోకి సురక్షితంగా విడిచిపెట్టారు. వన్యప్రాణుల పట్ల ప్రజలు భయాందోళనలు చెందకుండా, అవగాహనతో అటవీ శాఖకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు. అడవులను, వన్యప్రాణులను కాపాడటంలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న బేస్‌క్యాంప్ వాచర్లు, అటవీ సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేకంగా 'అపెక్స్ హెల్త్ క్యాంప్' ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ శిబిరం ద్వారా వాచర్లకు పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, వైద్య సలహాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ అవగాహన, వన్యప్రాణుల సంరక్షణ, ఉచిత ఆరోగ్య సేవలతో కూడిన వన మహోత్సవం–2026 అమ్రాబాద్‌లో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లాలు దాటి వస్తున్న నమ్మకం..

- 'అచ్చంపేట కేర్ హాస్పిటల్'కు పెరుగుతున్న ఆదరణ!
- మొన్న నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్..
- నేడు షాద్‌నగర్ నుంచి తరలివస్తున్న రోగులు
- ఆసుపత్రిలో చేరిన గర్భిణీకి సురక్షిత ప్రసవం
- పండంటి మగబిడ్డకు జననం
- వైద్య సేవల నాణ్యతపై హర్షం వ్యక్తం చేసిన రోగి బంధువులు

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేటలోని ప్రైవేట్ వైద్య రంగంలో నాణ్యమైన సేవలు అందిస్తూ స్వల్ప కాలంలోనే ఎనలేని గుర్తింపు తెచ్చుకున్న 'అచ్చంపేట కేర్ హాస్పిటల్' పై రోగులలో నమ్మకం రోజురోజుకూ రెట్టింపవుతోంది. స్థానిక ప్రాంతాలకే పరిమితం కాకుండా, జిల్లాలు దాటి మరీ సుదూర ప్రాంతాల నుండి రోగులు ఇక్కడి వైద్య సేవలను ఆశ్రయిస్తుండటం విశేషం. తాజాగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రాంతానికి చెందినఅనుజ (భర్త అనిల్) సురక్షిత ప్రసవం కోసం ప్రత్యేకంగా అచ్చంపేట కేర్ హాస్పిటల్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ నెల 15న మధ్యాహ్నం 1:30 గంటలకు ఆసుపత్రి వైద్య బృందం ఆమెకు విజయవంతంగా ప్రసవం చేయగా.. 2.4 కిలోల బరువుతో పండంటి మగ శిశువు జన్మించాడు. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రసవం అనంతరం రోగి భర్త అనిల్ ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుల సేవలపై అత్యంత సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందించిన ఆప్యాయత, సంరక్షణ ఎంతో అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు మాట్లాడుతూ.. "ఇటీవలి కాలంలో మన్ననూర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ వంటి వివిధ ప్రాంతాల నుండే కాకుండా, నేడు షాద్‌నగర్ లాంటి సుదూర ప్రాంతాల నుండి కూడా గర్భిణీలు ప్రసవాల కోసం మా ఆసుపత్రికి తరలిరావడం సంతోషకరం. ఇది ప్రజల్లో మా వైద్య సేవల నాణ్యత పట్ల ఉన్న అచంచలమైన విశ్వాసానికి మరియు నిదర్శనానికి అద్దం పడుతోంది" అని హర్షం వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన, అత్యుత్తమ వైద్య సేవలను నిరంతరం అందుబాటులో ఉంచడమే తమ ఆసుపత్రి ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు.




## 20న డిండి కట్ట మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పునుంతల మండలం లత్తిపూర్ గ్రామ శివారులో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం 'శ్రీ డిండి కట్ట మైసమ్మ' దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నెల 20 శనివారం రోజున ఉదయం 10:00 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో, దేవస్థాన కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తుల సమక్షంలో ఈ హుండీ లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించబడుతుందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో స్థానిక భక్తులు, స్వచ్ఛంద సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ధర్మకర్తృత్వ మండలి చైర్మన్ ఎడ్ల నరేష్ యాదవ్ సంయుక్త ప్రకటనలో కోరారు.

## సోదా కిరణ్ కుటుంబాకి మందకృష్ణ మాదిగ పరామర్శ



**పరకాల, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 53వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్ కుమార్ సతీమణి శాలిని ఇటీవల అకాల మరణం చెందారు. ఈ నేపథ్యంలో గురువారం పరకాలలోని వారి నివాసానికి చేరుకున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ.. సోదా కిరణ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మొదటగా శాలిని చిత్రపటానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ, సోదా కిరణ్ కుమార్‌లతో పాటు ఇతర కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు. తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబానికి తన సంతాపాన్ని తెలియజేస్తూ, వారికి ఎంఆర్‌పీఎస్ శ్రేణులు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని మందకృష్ణ మాదిగ భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ వెంట స్థానిక ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు, సోదా కుటుంబ సన్నిహితులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.